కవితా కౌముది

# గీసి చూడు

రఘు ఆళ్ళ

అంతే
ఒక్కోసారి నీకలా అనిపిస్తుంది-
నువ్వొక్కడివే
క్రిందపడి గాయపడినట్లు!
లేవలేనితనం
నీ చుట్టూ చేరి వెక్కిరిస్తున్నట్లు!
వేల గొంతులు
చిక్కటి చీకటిని
ఎక్కడి నుంచో
పోగేసి, తెగేసి
నీపై విసిరినట్లు!
భుజాల పైకెక్కిన
ఆ నల్లటి దెయ్యం
నిన్నింకా తొక్కుతున్నట్లు!
తడిమి చూడొకసారి
వెలుగెక్కడని ఎలుగెత్తి
హృదయపు చెవులకు
దిబ్బిళ్లెక్కేలా!
తగులుతుందో అగ్గిపెట్టె
జేబు వెనకున్న
పిడికెడు గుండే అది!

తలలు తగలపెట్టుకోని
చీకట్ల మొండేలను
మంటల్లో కాల్చివేసేలా!
పరిగెత్తుతున్న స్వార్థపు
గొంతులప్పుడు
మూగబోవాలి
సాగిలపడాలి
నీ దారిలో నిన్ను
సాగనివ్వాలి!
గాయమెక్కడని చూసుకుంటే
ఏడ్చి చచ్చిన
కుళ్లు దేహాలపైనని
నీకు కనబడాలి!
గీసి చూడా పుల్లని
నీ లోపట దాగిన
అత్మ స్థైర్యపు 'అగ్గి' పుల్లని
గీసి చూడు,
రాసి చూడు
ఒక ధైర్యపు చరిత్రని!!

★★★



# నిన్న-నేడు-రేపు

సూర్యదేవర వేణుగోపాల్



మస్తిష్కం మథించిన సంద్రమైందా
మెదడు నిప్పుల కొలిమిలా ఉందా
ఆక్రోశం అశ్రుధార అయ్యిందా
గతం గని ని త్రవ్వావా.....
గతం భూతమై భయపెడుతుందా
ఐనా, అది మరణించిన దృశ్యమేగా
గతం అంటే ఒలికిపోయిన జలమేగా!
అల్ప ప్రాణులం, రాగద్వేషాలకు
మోహావేశాలకు బందీలం
ఎన్నో చేస్తాం, మరెన్నో చేయిస్తాం
మది గది లో నిక్షిప్తం చేయకు
క్షోభితుడవై భార మనస్కుడవు కాకు-
స్వప్న ప్రాసాదం లో విహారం?
ఏమి ప్రయోజనం?
కాల్పనిక సృష్టి లో సౌధ నిర్మాణమేల?
మేను పులకించి ఆనంద బాష్పాలు
వర్షిస్తున్నాయా?
ఊహల విశ్వాన్ని మోస్తున్నావా?
రేపటికి రూపం లేదు
తపన పడకు ఏదో చేద్దామని
మరేదో సాధించాలని
రా| సజీవుడవు కా
గతం మరణించింది
రేపు అర్థం కానిది
నేడే సత్యం.....
చరించు వాస్తవంలో!
నిన్నటి చింతతో...
రేపటి స్వప్నాలతో.....
మరువకు నేటి కర్తవ్యాన్ని-
గతమే మార్గదర్శిగా
నేడు జీవించు....
భవిష్యత్ సురసామ్రాజ్యం అవుతుంది......!!

★★★



# నేనెక్కడ?

షేక్ షహనాజ్

'నేను' పుట్టిన రోజ
అదే 'నా' పుట్టిన రోజ!
ఆ క్షణమే 'నేను' కాస్త ... 'నా' అయిపోయింది!!
పోగొట్టుకున్న 'నేను' ని వెత్కుంటూ వెళ్ళగా...
నా ఊపిరి, నా శరీరం
నా తల్లి, నా తండ్రి
నా బంధువులు, నా స్నేహితులు అంటూ కనిపంచాయి!
'నేను' మాత్రం కనిపించలేదు!! ఇందులో 'నేను' ఎక్కడ?
నా పేరు, నా ఊరు
నా వంశం, నా కులం
నా సంతోషం, నా ఆరోగ్యం కనిపంచాయి!
'నేను' మాత్రం కనిపించలేదు!! ఇందులో 'నేను' ఎక్కడ?
నా విజ్ఞానం, నా విజయం
నా చదువు, నా ఉద్యోగం
నా ఇష్టం, నా కష్టం కనిపంచాయి!
'నేను' మాత్రం కనిపించలేదు!! ఇందులో 'నేను' ఎక్కడ?
నా ఇల్లు, నా ఆస్తి
నా పెళ్ళి, నా పిల్లలు
నా సంసారం, నా జీవితం కనిపంచాయి!
'నేను' మాత్రం కనిపించలేదు!! ఇందులో 'నేను' ఎక్కడ?
'నా'వన్నీ వదిలేసిన రోజ, నాకు 'నేను' మళ్ళీ దొరికాను!
'నేను' గా పుట్టాను, 'నేను' మాత్రమే గిట్టాను!
నా జివిత కాలచక్రమంతా ఎక్కి తిరిగాను!
'నా'ది మిథ్య, 'నేను' వాస్తవం అని ఎరిగాను!!

***



# అనంతం
## మూలా వీరేశ్వరరావు

కళ్ళ నుండీ
కల ల్లోకి గెంతాను !
"చంద్ర" కాంత
చషకం నుండి జారిన
వెన్నెల త్రాగాను !
నక్షత్రాల పై
నఖ క్షతాలు అద్దాను !
రోదన కి
దూరమై
రోదసీ లో విహరించాను !
విశ్వం తో
బృంద గానం చేసాను !
శాంతి శాశ్వతమని
భ్రాంతి చెందాను ,
క్రూర రాత్రి
మళ్ళీ
తూర్పు ఒడ్డున
పడేసింది !

★★★

# Fragments
## శ్రీధర్ చందుపట్ల

1

‖ అతడు ‖

అతనికి వీడ్కోలు చెప్పినప్పుడు
నేనెప్పుడూ వెనుతిరిగి
చూసే సాహసం చేయలేదు,
గాలిలో కలిసిపోయి
అదృశ్యమవుతాడేమోనని భయం.

★★★

2.

‖ సంధి. ‖

యింక ఆఖరికి
మనం నిష్క్రమించాలనే
సంధి చేసుకున్నపుడు,
ఎక్కడికెళ్ళాలో తెలీక
చివరికి మన సరిహద్దు రేఖ దగ్గరే మిగిలిపోతాం,
అదృశ్యపరంలోని బందీల్లా.

★★★



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

తెరచి యున్నది తలుపు, కాపరులు లేరు
వెడలిపోవగనేమడ్డు స్వేచ్ఛ వైపు?
ఈ క్షణమ్మునననే పరువెత్తగలను
ఏల యడుగులు సాగవో యెరుగలేను

పిలుచుచున్నది మేల్కొన్న కలల పాట
వెడలమన్నది హృదిలోని ప్రియపిపాస
ఏదొ పాశము నన్ను బంధించుచుండె
తృణమునైన ఛేదింపలేనేమి నేడు?

గడప దాటగ తీరును కాంక్షలన్ని
దాటనేరక బ్రతుకెల్ల స్తబ్ధమయ్యె
ఇంత జీవితమ్మును రసహీనమయ్యె
ఇంత బ్రతుకును జీవరాహిత్యమయ్యె

ద్వారమును దాట ప్రేమసంద్రమ్ము కలదు
ప్రేమ లేదిటుప్రక్క, జీవితము లేదు
ప్రకృతి తనివార ప్రేమను పంచునచట
ప్రేమనెరుగక మది విలపించునిచట

వలయునీ స్వేచ్ఛ యంచును తెలియు నాకు
ద్వారమును దాటనేవొ బంధములు లాగు
వెనుదిరుగలేక ముందుకు వెడలలేక
ఇచటనే యుందు శ్వాస స్తంభించుకొరకు



చిత్రం:కె.రామ్మోహన్

COMMENTS